

కూడవెల్లి జాతరలో జనం



కొమురవెల్లి మల్లన్న ఆలయం రాజగోపుర ఆవరణలో జనసందోహం



కొమురవెల్లిలో మల్లన్నకు బోనం తీసుకెళుతున్న మహిళలు



పుల్లూరు బండపై లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



పుల్లూరు బండపై దుర్గప్రసాద్ స్వామితో హరీశ్‌రావు

భక్తిపారవశ్యం

నాలుగోవారం జాతరతో కొమురవెల్లి క్షేత్రం.. మాఘ మాసం ఉత్సవాలతో రామేశ్వరంపల్లి రామలింగేశ్వర ఆలయం.. కల్యాణ క్రతువుతో పుల్లూరు బండ లక్ష్మీనర్సింహస్వామి సన్నిధి భక్తిపారవశ్యమైంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఆయా క్షేత్రాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దైవదర్శనం చేసుకుని తరించారు.

కొమురవెల్లి, కూడవెల్లి, పుల్లూరు బండ జాతరలకు పోటెత్తిన భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 11 : కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో వారం జాతరను పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పవిత్రమైన కోనేరులో స్నానమాచరించారు. మల్లన్నకు సంప్రదాయబద్ధంగా మట్టి కుండలలో బెల్లం పాయసం వండి బోనం నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి స్వామివారి దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించి తమను కాపాడమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లం పానకం సాకపెట్టి బోనం నివేదించారు. ఒడిబియ్యం సమర్పించి తమ పసుపు, కుంకుమలు, పాడిపంటలు చల్లగా కాపాడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు బందోబస్తు చర్యలు నిర్వహించారు. రద్దీ కారణంగా ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, వీవీఐపీ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టడంతో పడిగాపులు కాశారు.

కూడవెల్లి కిటకిట

దుబ్బాక, ఫిబ్రవరి 11 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం జాతరకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అక్బర్‌పేట చౌరస్తా నుంచి కూడవెల్లి వాగు వరకు భక్తులతో కిటకిటలాడింది. నాలుగు కిలోమీటర్ల మేర సందడి నెలకొన్నది. స్వామి వారి దర్శనానికి అంతగా రద్దీ లేకున్నా జాతరను చూసేందుకు వచ్చిన భక్తులతో జన సంద్రంగా మారింది. ఆదివారం కావడంతో మాంసప్రియులు చెట్లకింద విడిది చేసి, ఆలయం దర్శనానికి అంతగా ఆసక్తి చూపినట్టు కనిపించలేదు. మూడో రోజు జాతరకు సుమారు లక్ష మంది తరలివచ్చి ఉంటారనే అంచనా.



పుల్లూరు బండపై భక్తుల సందడి

కన్నులపండుగగా కల్యాణం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి11 : సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండ జాతర చివరి రోజు భక్తజనసంద్రాన్ని తలపించింది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. విజయవాడ దాసాంజనేయ ఆశ్రమం దుర్గ ప్రసాద్‌స్వామి బండపై ఆలయాలను దర్శించుకుని అవసరమైన సూచనలు చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీదేవిచందర్ రావు, జడ్పీటీసీ కోటగిరి శ్రీహరిగౌడ్, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు


పెరి అర్బన్ జోన్‌తో మహర్దశ

- ములుగు, వర్గల్, మర్కూక్ మండలాలు ఈ జోన్ పరిధిలోకి..
- ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు మధ్య ప్రాంతం
- పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం

గజ్వేల్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని బడ్జెట్ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం మూడు జోన్లు ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్‌గా, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో గల ప్రాంతాన్ని పెరి అర్బన్(పట్టణ శివారు ప్రాంతం)జోన్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు ఆవలి ప్రాంతాన్ని గ్రామీణ జోన్‌లుగా గుర్తించనున్నారు. పట్టణ ప్రాంతం ఇప్పటికే అభివృద్ధి చెందగా, పెరి అర్బన్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఈ పెరి అర్బన్ జోన్ పరిధిలోకి జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ములుగు, వర్గల్, మర్కూక్ మండలాలు వెళ్లనున్నాయి. ఇప్పటికే ఈ మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా, పెరి జోన్ పరిధిలోకి వెళ్లడంతో మహర్దశ పట్టనున్నది.

భారీగా పరిశ్రమలు

వర్గల్, ములుగు, మర్కూక్ మండలాల్లో ఇప్పటికే భారీగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ములుగు మండలం సీడ్‌హబ్‌గా ఆవిర్భవించగా, మర్కూక్ మండలంలోని కర్కపట్లలో ఇండస్ట్రియల్ సెజ్(పారిశ్రామికవాడ) గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటైంది. ఇక వర్గల్ మండలంలో డూపాయింట్‌తో పాటు చిన్నచిన్న పరిశ్రమలు ఉండగా మరిన్ని ఏర్పాటుకు ఇప్పటికే టీఎస్ఐఐసీ ద్వారా భూమిని సైతం ప్రభుత్వం సేకరించింది. కర్కపట్ల, బండమైలారం, కొత్తూరుల్లోని పరిశ్రమల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. ములుగు, వర్గల్ మండలాల్లో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ జోన్‌లో కోకాకోలా, అమూల్, ఆజాద్ ఎలక్ట్రికల్స్ పరిశ్రమలు రాష్ట్ర ప్రభుత్వంతో అంగీకారం కుదుర్చుకుని ఉన్నాయి. పెరి అర్బన్ జోన్ పరిధిలో ప్రభుత్వం మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నది.



వర్గల్, ములుగు, మర్కూక్ మండలాలు

అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

పెరి అర్బన్ ఏరియాలో ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడం, భవనాల నిర్మాణం చేపట్టేందుకు వీలు ఉండదు. నిబంధనల మేరకు ప్రభుత్వం రూపొందించే విధివిధానాల మేరకు అనుమతులను మంజూరు చేస్తారు. ములుగు మండలంలోని బండమైలారం, కొత్తూరు, నర్సాపూర్, కొక్కొండ గ్రామాల్లో విత్తన పరిశ్రమలు ఏర్పాటు కాగా, మర్కూక్ మండలంలోని కర్కపట్ల సెజ్‌లతో అనేక పరిశ్రమలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పెరి అర్బన్ జోన్‌ను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకువస్తే మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి. పారిశ్రామికంగా, ఆర్థికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సిద్దిపేట అభివృద్ధి సూపర్

- మున్సిపాలిటీ పనితీరు భేష్
- పట్టణంలో పర్యటించిన సెంట్రల్ సెక్రటేరియట్ సెక్షన్ బృందం సభ్యులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11 : సిద్దిపేట అభివృద్ధి సూపర్ అని కేంద్ర సెక్రటేరియట్ సెక్షన్ బృందం సభ్యులు కితాబిచ్చారు. జిల్లాలో ఐదురోజులుగా పర్యటిస్తున్న 14 మంది అధికారులు చివరి రోజు పర్యటనలో భాగంగా ఆదివారం సిద్దిపేట పట్టణాన్ని సందర్శించారు. ఈమేరకు బృందం సభ్యులకు పట్టణంలోని స్వచ్ఛబడిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజులరాజనర్సు కమిషనర్ సంపత్‌కుమార్ పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం, స్వచ్ఛ బడి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, బుస్సాపూర్ డంపింగ్‌యార్డు, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను వారు సందర్శించారు. అధికారుల బృందం సభ్యులు మాట్లాడుతూ సిద్దిపేట స్వచ్ఛబడి ఒక పుస్తకం వంటిదని ఇందులో ఎన్నో విషయాలను పొందుపరచారని చెప్పారు. స్వచ్ఛబడిలో తెలుసుకున్న విషయాల పట్ల తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. తమ ఐదు రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజు సిద్దిపేట పట్టణంలో పర్యటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారుల పనితీరు భేష్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలపురం దీప్తినాగరాజు, డీఆర్డీఏ అధికారులు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ మల్లికార్జున్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలో నిర్వహిస్తున్న సూర్యనమస్కారాల పోటీ

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

- గురువుల పరంపరతో దేశ వికాసం
- పతంజలి యోగ పీఠాధికారి యజ్ఞదేవ్
- సిద్దిపేటలో రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీ

7



యోగాసనాలు వేస్తున్న మహిళలు

తులం బంగారం ఇస్తామన్నారు.. బడ్జెట్‌లో కేటాయింపుల్లేవ్?

- మైనార్టీలకు రూ.2 వేల కోట్లే కేటాయించారు
- రెండు నెలల నుంచి వృద్ధులకు ఆసరా పెంఛన్ అందలేదు
- వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు బడ్జెట్‌లో నిధులే కేటాయించలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.12 వేల కోట్లు ఆర్థిక సహాయం అందించామన్నారు. వృద్ధులకు ఆసరా కింద రూ.4 వేలు పింఛన్ అందిస్తామని అబద్ధాలు చెప్పారని, రూ.4వేలు కాదు కదా రెండు నెలలు నుంచి రూ.2 వేల పింఛన్‌ను చెల్లించలేదని మండిపడ్డారు. సాగుకు 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పి, కనీసం 16 గంటలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని హజ్ హౌస్‌లో ఉమ్రా యాత్రకు వెళ్తున్న పదిమంది ముస్లింలను హరీశ్‌రావు సన్మానించి మాట్లాడారు. ఎన్నికల్లో మైనారిటీలకు పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే మొండిచెయ్యి చూపిందన్నారు. బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి రూ.2,200 కోట్లు ఇచ్చి మోసం చేసిందని తెలిపారు. పట్టణంలోని పోలీస్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహానికి హరీశ్‌రావు హాజరయ్యారు.

కేసీఆర్ ట్రోఫీ విజేతలకు నగదు బహుమతి

కేసీఆర్ ట్రోఫీ సీజన్ 3లో భాగంగా గెలుపొందిన జట్లకు ఆదివారం సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. విజేత జట్టుకు రూ.2 లక్షల నగదు, ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ.లక్ష నగదు, ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ క్రీడాకారుడికి రూ.50 వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, విజయ్ రవీందర్ రెడ్డి, పాల సాయిరాం, జావ శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్, కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, నాయకులు మోయిజ్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మోయిజ్, జావేద్, అహ్మద్, ఫక్రుద్దీన్, తాహేర్, గౌస్ మోహియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు నగదు, ట్రోఫీని అందజేస్తున్న హరీశ్‌రావు

ఎంపీడీవోల బదిలీలు

గజ్వేల్, ఫిబ్రవరి 11: సిద్దిపేట జిల్లాలో భారీగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. వి.భాస్కర్‌శర్మను రాజన్న సిరిసిల్లా జిల్లాకు, ఆర్.రాజిరెడ్డి, టి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్‌రెడ్డిని మెదక్ జిల్లాకు, మేరీ స్వర్ణకుమారి, పి.రాంరెడ్డి, వి.ఎల్.అనురాధ, జి.సీమునెయ్య, సయ్యద్ తారీఖ్‌అన్వర్‌ను నల్గొండ జిల్లాకు, బీమధుసూదన్, దమ్మని రాము, ఎం.శ్రీధర్‌ను కరీంనగర్ జిల్లాకు, పట్టాభి రామారావు, కె.సత్యపాల్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లాకు, జి.శ్రీనివాస్‌గౌడ్‌ను పెద్దపల్లి జిల్లాకు, ఎం.మురళీధర్‌శర్మను ఆదిలాబాద్ జిల్లాకు ఎం.మశ్చేంద ర్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు, కె.రాజేశ్‌కుమార్‌ను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. జగిత్యాల జిల్లా నుంచి ఎస్.జనార్దన్, జనగాం జిల్లా నుంచి పి.వేణుగోపాల్‌రెడ్డి, ఖమ్మం జిల్లా నుంచి బానోత్ జయరాం, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ జిల్లా నుంచి మార్టిన్ లూథర్, జి.గణేశ్‌రెడ్డి, ఎం.వెంకటలక్ష్మమ్మ, జి.శ్రీరాములు, నల్గొండ జిల్లా నుంచి పీపీఎస్‌ఆర్‌కే శర్మ, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఎస్.రాంమ్మోహన్, నారాయణపేట నుంచి విజయలక్ష్మి, వికారాబాద్ జిల్లా నుంచి బండి లక్ష్మప్ప, మెగార్‌గారి ఉమాదేవి, పోతరాజు బాలయ్య, గద్వాల జిల్లా నుంచి జి.కృష్ణయ్య, వనపర్తి జిల్లా నుంచి అఫ్జలుద్దీన్, ఆర్.వెంకటేశ్వర్లు, యాదాద్రి-భువనగిరి జిల్లా నుంచి బి.యాదగిరి బదిలీపై రానున్నారు.



మెదక్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

‘కారు’ ఇక.. ఫామ్‌హౌస్‌కే!

- బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే మురుగు కాలువలో వేసినట్లే
- కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మెదక్ అర్బన్/పాపన్నపేట, ఫిబ్రవరి 11: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవడం తప్పా.. ప్రజలకు సేవ చేయదని బీజేపీ దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మెదక్, హవేళీఘణపూర్, పాపన్నపేట మండల కేంద్రంలోని మంజీరా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాలకు రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపైనా ఉన్నదన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీని ప్రజలు చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ దర్శన్ నిధులతో ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మెదక్ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ లేకున్నా మెదక్ నుంచి ఎల్కతుర్తి వరకు రూ.16 కోట్లతో 765 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించిందన్నారు. అంతేకాకుండా మెదక్ రైలు తెచ్చిన ఘనత బీజేపీదేనని చెప్పారు. పల్లెల్లో వేసిన సీసీరోడ్లు, వీధిలైట్లు, మరుగుదొడ్లు, శ్మశానవాటికలు, ఉపాధిహామీ పనులన్నీ కేంద్ర ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. పదవీ కాలం ముగిసిన సర్పంచులకుకేంద్ర ప్రభుత్వం గురించి చాలా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నందారెడ్డి, మండలాధ్యక్షుడు రాములు, సీనియర్ నాయకులు సంతోష్‌చారి, సత్యం, నరేష్, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

కానరాని లహరి బస్సులు

- సూపర్ లగ్జరీ, డీలక్స్‌తో సరి
- ఇవే పూర్తిస్థాయిలో నిండని పరిస్థితి
- అందుకే లహరి బస్సులు నడపలేమంటున్న అధికారులు



సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11 : ఇప్పటివరకు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులకు సౌకర్యవంతమైన సులభతరమైన ప్రయాణాన్ని అందించడానికి అందుబాటులోకి తెచ్చిన లహరి బస్సులు మాత్రం ఉమ్మడి జిల్లాలో కానరావడం లేదు. స్వయంగా రవాణా శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలో లేకపోవడం గమనార్హం. సిద్దిపేట నుంచి షోలాపూర్, తిరుపతి, కామారెడ్డి, సికింద్రాబాద్, కరీంనగర్, వేములవాడ, హుస్నాబాద్, సంగారెడ్డి లాంటి జిల్లాలకు రోజువారీగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన పట్టణంగా ఎదిగిన సిద్దిపేట ఆర్టీసీ డిపోలో లహరి బస్సు సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికుల నుంచి కొంత అసంతృప్తి వ్యక్తమవుతున్నది. అయితే సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లోనే ప్రయాణించేందుకు పూర్తిస్థాయిలో మొగ్గు చూపడం లేదని, ఇక లహరి బస్సులు నడిపితే ఆర్టీసీకి నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. లహరి బస్సులో 20 మంది ప్రయాణికులు కూర్చునేందుకు, 8 మంది వరకు పడుకోవడానికి అవకాశం ఉంటుంది. మామూలుగా సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులలో 40 మంది ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. టికెట్ ధర కూడా వాటితో పోల్చుకుంటే లహరికి 80 శాతం ఎక్కువగా ఉంటుంది.

ఇప్పట్లో లహరి బస్సులు లేనట్టే

సిద్దిపేట డిపో పరిధిలో లహరి బస్సుల సౌకర్యం ఇప్పట్లో ఉండే అవకాశం లేదు. అంత ధర పెట్టి ప్రయాణికులు ప్రయాణించే పరిస్థితి లేదు. ప్రయాణికులు కోరుకుంటే భవిష్యత్తులో లహరి బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉండవచ్చు.

- సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్

యువకుడి అదృశ్యం



దీపక్ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 11: అయోధ్యకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైయాడు. ఈ సంఘటన చేగుంట మండలం పులిమామిడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి దీపక్ (23) ఈ నెల 7న అయోధ్యకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల వద్ద వాకబు చేసినా అతని ఆచూకీ లభించలేదు. దీపక్ తాత పోతుగంటి బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరీష్ గౌడ్ తెలిపారు.

వెలుగులకు నో 'స్కోర్'!

- క్రమబద్ధీకరణకు నోచుకోని ఉద్యోగులు
- ఏళ్లుగా చాలీచాలని జీతంతో వెతలు
- రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు
- 12 ఏళ్లుగా అమలు చేయని అధికారులు
- ఇంధన కార్యదర్శి ఆదేశాలూ బేఖాతరు

జోగిపేట, ఫిబ్రవరి 11: వారంతా.. అందోలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు వెలుగులు పంచే విద్యుత్ శాఖ ఉద్యోగులు. కానీ, వారి జీవితాలకు ముప్పై ఏళ్ళుగా చీకట్లే మిగిలాయి. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వని చందంగా తయారైంది సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గంలోని 'స్కోర్' ఉద్యోగుల పరిస్థితి. వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించమని హైకోర్టు తీర్పు ఇచ్చినా, రెగ్యులరైజ్ చేయమంటూ ఇంధన కార్యదర్శి ఆదేశాలిచ్చినా.. వాటినన్నిటినీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేశారు. పెద పెద్ద స్థానాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల బంధువులు, కుటుంబ సభ్యులకు అర్హతలేకున్నా, ఒక్కరోజు ఉద్యోగం కూడా చేయకున్నా, వారిని పర్మినెంట్ చేస్తూ ఆదేశాలిచ్చిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు.. అన్ని అర్హతలు ఉండి 30 ఏళ్ళుగా చాలీ చాలని జీతంతో వెట్టి చాకిరీ చేస్తున్న 'స్కోర్' ఉద్యోగుల పట్ల మాత్రం పట్ల మాత్రం వివక్ష చూపుతున్నారు.

1982-83లో జోగిపేట (అందోలు నియోజకవర్గం) కేంద్రంగా సంజయ్ కోఆపరేటివ్ గ్రామీణ విద్యుత్ సంస్థ (స్కోర్) ఏర్పాటైంది. అప్పటి అందోలు నియోజకవర్గ పరిధిలోని అందోలు, పుల్కల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలు, మెదక్ నియోజకవర్గానికి చెందిన టేక్మాల్, పాపన్నపేట, పెద్ద శంకరంపేట మండలాలకు ఈసంస్థ ద్వారా విద్యుత్తు సరఫరా, మెయింటెనెన్స్ తదితర కార్యకలాపాలు నడిచేవి. అప్పట్లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), ఆపై ఉండే ఉన్నత స్థాయి ఉద్యోగులను మాత్రం నేరుగా నోటిఫికేషన్‌తో నియమించుకున్నారు. కిందిస్థాయి సిబ్బందిని మాత్రం క్యాజువల్ లేబర్‌గా దినసరి వేతనంతో స్కోర్ నిబంధనల మేరకే నియమించుకున్నారు. నిబంధనల ప్రకారం 240 రోజుల తర్వాత వారిని కన్సాలిడేటెడ్ కార్మికులుగా గుర్తిస్తూ అప్పటి యాజమాన్యం జారీ చేసింది. ఇలా 77 మంది కన్సాలిడేటెడ్ కార్మికులు నియామకమయ్యారు.సంస్థ నష్టాల్లో ఉండటంతో 2005లో అప్పటి ఏపీసీపీడీసీఎల్ (ప్రస్తుత టీఎస్‌ఎస్‌పీడీసీఎల్)లో సంస్థను విలీనం చేసారు. అయితే, పర్మనెంట్ ఉద్యోగులు (అప్పట్లో రిక్రూట్ మెంట్ ద్వారా చేర్చుకున్న వారిని)ను సూపర్ న్యూమరీ పోస్టులలో (సూపర్ న్యూమరీ పోస్ట్ అంటే, పదోన్నతి లేకుండా రిటైర్‌మెంట్ వరకూ ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే ఉంటూ వేతనాలు మాత్రం ఇతర రెగ్యులర్ ఉద్యోగుల్లానే పొందే విధంగా) 50 మంది నియమితులయ్యారు. ఈ ఉద్యోగులు రిటైర్ అయిన పిదప సదరు ఉద్యోగాలు (పోస్టులు) ఆటోమేటిక్‌గా రద్దు అవుతాయి. కిందిస్థాయిలో ఉన్న 77 మంది కార్మికులకు మాత్రం స్కోర్‌లో ఇచ్చిన వేతనాన్ని మాత్రమే చెల్లిస్తూ.. వారి అర్హతల ఆధారంగా ఖాళీగా ఉన్న కార్మిక పోస్టులలో భర్తీ చేసుకున్నారు. వీరికి ఎలాంటి వేతన పెంపు గానీ, ఇతర భత్యాలు గానీ ఉండవు. ఈ నేపథ్యంలో తమకు వేతనాలు పెంచాలని, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంటు చేయాలని పలుమార్లు ఐఎన్టీయూసీ అనుబంధ సంస్థ 327 కార్మిక సంఘం ద్వారా ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావుకు విన్నవించారు.

కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

ఎన్ని విన్నపాలు చేసినా న్యాయం జరగడం లేదంటూ 5 గురు కార్మికులు 2011 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. ఇదే క్రమంలో సదరు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంవల్ల తమకేమీ నష్టం లేదంటూ, అప్పటి ఏపీసీపీడీసీఎల్, సీఎండీ శ్రీకృష్ణప్రసాద్ ప్రభుత్వానికి లేఖ సైతం రాశారు. ఈలేఖ ఆధారంగా ఉద్యోగులను పర్మనెంట్ చేయాలనీ 2012 జనవరిలో హైకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు తీర్పు ప్రతినిధిని కార్మిక సంఘ నాయకులతో కలిసి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను కలిసినా.. ఆ ఉత్తర్వులు అమలు కాలేదు.

ఇంధన శాఖ కార్యదర్శి ఆదేశాలూ..

ట్రాన్స్‌కో సీఎండీ నిర్ణయం తీసుకోక పోవడం వారి రాష్ట్ర ఇంధన కార్యదర్శిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి 2017లో.. సదరు కార్మికుల పర్మనెంట్ విషయంలో న్యాయ సలహా కూడా తీసుకున్నారు. ట్రాన్స్‌కోతో నాలుగేళ్ళపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన అనంతరం వారిని పర్మనెంట్ చేయాలని ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి పట్టి టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఐతే. సదరు ఆదేశాలను రఘుమారెడ్డి అమలు చేయక పోగా, దానిని ట్రాన్స్‌కో జేఎండీకి పంపి చేతులు దులుపుకున్నారు.



జోగిపేటలోని ట్రాన్స్‌కో కార్యాలయం

బెంగతో కార్మికుడి మృతి..

ఏళ్లకేళ్ళుగా వేతనాలు పెరగకపోవడం, రెగ్యులరైజ్ కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు అఫ్జల్ మృతి చెందాడు. మరణించిన కార్మికుడి కుటుంబంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వకపోవడం అటుంచి కనీసం అంత్య క్రియలకు ఖర్చులు కూడా యాజమాన్యం ఇవ్వలేదు.

రెండు రకాల వేతనాలు..

స్కోర్ ఉద్యోగుల వేతనాల్లోనూ రెండు రకాలుగా చెల్లించడం ట్రాన్స్‌కో కే చెల్లింది. ఒకే సంస్థలో పనిచేస్తూ.. ఒకేలా జీతభత్యాలు తీసుకుంటూ 2005లో అప్పటి స్కోర్ నుంచి 77 మంది కార్మికులు అప్పటి ఏపీసీపీడీసీఎల్ (ప్రస్తుత టీఎస్‌ఎస్‌పీడీసీఎల్) లో విలీనం అయ్యారు. కానీ, వీరిలో 28 మందికి మాత్రమే పే, డీఏ ఇస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి, మిగతా వారికి మొండిచేయి చూపింది. దీంతో మిగిలిన 49 మంది కార్మికులు మాత్రం ఆర్టిజన్‌కు వచ్చే జీత భత్యాలను పొందుతున్నారు.

30 ఏళ్ళ క్రితం ఉద్యోగంలో చేరాం..



2005లో మా సంస్థ స్కోర్ మూసివేసినప్పుడు మమ్మల్ని అప్పటి ఏపీసీపీడీసీఎల్‌లో విలీనం చేసుకున్నారు. కానీ ఉద్యోగ క్రమబద్ధీకరణ మాత్రం జరగలేదు. ఐదుగురం కోర్టుకెళ్లగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానము క్రమబద్ధీకరించాలని 2012లో తీర్పు ఇచ్చింది. సాక్షాత్తు ఇంధన శాఖ కార్యదర్శి ఆదేశించినా మాకు న్యాయం జరగలేదు. మా సగటు ఉద్యోగ కాలం వెట్టి చాకిరికి సరిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నాం.

\- జి.శేషశయనరెడ్డి, స్కోర్ కార్మికుడు

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

- గురువుల పరంపరతో దేశ వికాసం
- పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్
- సిద్దిపేటలో రాష్ట్ర స్థాయి సూర్యనమస్కారాల పోటీ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి11: భారతీయ గురువరంపర, సంస్కృతి వల్ల దేశ ఖ్యాతి ప్రపంచంపై చెరగని ముద్ర వేస్తున్నదని పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని బాలికల ప్రభుత్వ పాఠశాల మైదానంలో యోగాసన స్పోర్ట్స్ సిద్దిపేట జిల్లా అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారల పోటీ ఉత్సవంలో పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం, ప్రాణాయామం మొదలగు విద్యలు దేశాన్ని సుసంపన్నం చేశాయని తెలిపారు. గురువుల మార్గదర్శనంలో దేశం వికసిస్తుందని వివరించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారతీయ సంస్కృతి సమాధానం చెబుతుందన్నారు. గురువులు చూపిన మార్గంలో పయనించి అద్భుతాలు సృష్టించాలని, అన్ని రంగాల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా పోటీల్లో గెలుపొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఐడీసీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, సిద్దిపేట స్పోర్ట్స్ అథారిటీ కన్వీనర్ పాల సాయిరాం, సుడా మాజీ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, జాతీయ యోగా మెడలిస్ట్, శిక్షకులు తోట సతీష్, సంధ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్ పాల్గొన్నారు. సిద్దిపేట కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో విజేతలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విజేతలకు చెక్కులను, మెడల్స్ జ్ఞాపికలను అందజేశారు. సూర్యనమస్కారాల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పిల్లలను ఆశీర్వదించారు. జాతీయస్థాయిలో ఆద్భుతంగా రాణించాలని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు తోట సతీష్ , సంధ్య, కే .అంజయ్య, తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్

పోరాడి హక్కులు సాధించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 : కేంద్రప్రభుత్వంతో పోరాడి మన హక్కులను సాధించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పది సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉన్నా, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రూ.18వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందులో అన్ని రంగాల వారు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, ఆశ వర్కర్ల యూనియన్ వారు యశోద, వీరమణి, ప్రశాంతి, గంగా, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలికుంట దశ మారేనా?

- చెత్తాచెదారం నిండి దుర్వాసన
- సుందరీకరణ కోసం పదేళ్ల క్రితం ప్రతిపాదనలు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న బొబ్బిలికుంట నిరాదరణకు గురవుతున్నది. ఈ చెరువును సుందరీకరించాలనే ఉద్దేశంతో పదేళ్ల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ పట్టించుకోలేదు. 2014లో అప్పటి ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయ ద్వారా వేలాది కోట్లు ఖర్చు చేసినప్పటికీ సంగారెడ్డిలోని బొబ్బిలికుంటను విస్మరించారని విమర్శలున్నాయి.

బొబ్బిలికుంటను సుందరీకరించి బోటింగ్, ఫౌంటేన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. 2012లో బొబ్బిలికుంట సుందరీకరణ కోసం అప్పటి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సూచన మేరకు ఇరిగేషన్ అధికారులు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తర్వాత 2014లో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను బుట్టదాఖలు చేసినట్లు ఆరోపణలున్నాయి. 2015లో మిషన్ కాకతీయ కింద సంగారెడ్డిలోని ఎర్రకుంట, మహబూబ్‌సాగర్, దుబ్బకుంట, తదితర చెరువుల్లో పూడికతీత, కట్ట మరమ్మతులు, తూములు, అలుగుల నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బొబ్బిలికుంట సుందరీకరణను మాత్రం మరిచారు.

బొబ్బిలికుంట చెరువుకు మరమ్మతులు చేయకపోవడంతో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు చెత్తా చెదారంతో దుర్వాసన వస్తున్నది. పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లోని వ్యర్థాలను ఈ చెరువులోనే వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. మరోవైపు పక్కనే ఉన్న రాజీవ్ పార్కు, స్విమ్మింగ్ పూల్‌లోకి వచ్చే సందర్శకులు కూడా దుర్వాసనను భరించలేకపోతున్నారు.



చెరువులో గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు

పూడికతీత నిధులు హాంఫట్

బొబ్బిలికుంట పూడికతీత పనుల కోసం పట్టణ ప్రగతి కింద రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు మంజూరు చేశారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదంతో 2022లో ఆ నిధులు మంజూరు కాగా, నామమాత్రంగా పనులు చేసి ఆ నిధులు స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. కాంట్రాక్టర్ కేవలం మూడు రోజులే పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. బొబ్బిలికుంట సుందరీకరణ పట్ల మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి.

ఆక్రమణకు గురవుతున్న బొబ్బిలికుంట

అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నది. కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న ఈ కుంటలో ఇప్పటికే కొంతమంది అక్రమంగా ఇళ్లను నిర్మించి విక్రయించారు. చెరువును సుందరీకరిస్తే సందర్శకులతో పాటు పట్టణ వాసులు వాకింగ్ చేస్తూ ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు వీలుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రాలు చేస్తున్నాడని హత్య

- మద్యంలో విషం కలిపిన కొడుకు, తమ్ముడు
- 48 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: మంత్రాల నెపంతో తండ్రిని కన్న కొడుకే హత్యచేశాడు. ఈ కేసును సిద్దిపేట రూరల్ పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఆదివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ భూమయ్య తన కుటుంబసభ్యులతో కలిసి సిద్దిపేట జిల్లా కేంద్రంలో నివాసముంటున్నాడు. భూమయ్య తమ్ముడు నిమ్మ కనకయ్య కుటుంబసభ్యులు సొంత గ్రామంలోనే నివాసముంటున్నారు. వారు తరచూ అనారోగ్యానికి గురవుతుండడంతో భూమయ్యపై అనుమానం పెంచుకున్నారు. మంత్రాలు చేయడమే కారణమంటూ భూమయ్యతో గొడవపడేవారు. ఈ క్రమంలో భూమయ్య కుమారుడు నిమ్మ ప్రవీణ్‌తో కలిసి భూమయ్యను హత్య చేసేందుకు కనకయ్య పన్నాగం పన్నాడు. ఈ నెల 10న వారి సొంత గ్రామం నామాపూర్‌కు భూమయ్యను పిలిపించి, ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. రాత్రి కావడంతో భూమయ్యను సిద్దిపేటలో దింపేందుకు బైక్‌పై ముగ్గురు బయలుదేరారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రామవాపూర్ గ్రామ శివారులో గల పిట్టలవాడ సమీపంలో మళ్లీ మద్యం సేవించారు. అక్కడ నిదితులు అనుకున్నట్లుగా మద్యంలో పురుగుల మందు కలిపి భూమయ్యకు తాగించడంతో భూమయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం మృతదేహంపై గడ్డివేసి తగులబెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై రామవాపూర్ గ్రామ కార్యదర్శి యాదగిరి సిద్దిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ కిరణ్‌రెడ్డి విచారణ చేపట్టి 48 గంటల్లో నిందితులను పట్టుకుని రిమాండుకు తరలించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

'చలో నల్లగొండ'కు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల, ఫిబ్రవరి 11: తెలంగాణ జల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలోని ఆమె నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలను కేంద్రం ఆధీనంలోకి ఇచ్చేందుకు కుట్రలు పన్నుతున్నదని, తద్వారా తెలంగాణ ఎడారిగా మారనున్నందున కాంగ్రెస్ ప్రభుత్వ దమననీతిని ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, నాయకులు యాట యాదగిరి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ టౌన్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



కొండపాక: కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా కన్యకాపరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం

గజ్వేల్ టౌన్/కొండపాక, ఫిబ్రవరి 11: శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు గజ్వేల్ పట్టణంలోని ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గోళి సంతోష్, తోట బిక్షపతి, సిద్ది బిక్షపతి, నేతి శ్రీనివాస్, వెంకటేశ్, ఉమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కుకునూరుపల్లిలోని ఆలయంలో ఆదివారం వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా పంచామృత అభిషేకం, కుంకుమార్చన, అమ్మవారి పారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, వాసవీ క్లబ్ మండలాధ్యక్షుడు ఉప్పల రాజు, సెక్రెటరీ శివకుమార్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు స్రవంతి పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



స్వామి మృతదేహం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 11: మూడురోజుల క్రితం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద కూడవెల్లి వాగులో స్వామి(41) అనే వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున మిరుదొడ్డిలోని చెక్‌డ్యాం వద్ద మృతదేహం ఉన్నదని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య సౌమ్య, ఇద్దరు పిల్లలున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 11: చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన నర్ర తార ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మూడురోజుల క్రితం జోగులాంబ అమ్మవారి దర్శనం కోసం వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటికి తాళంవేసి ఉండటాన్ని గమనించిన ఆగంతకులు ఇంట్లోకి చొరబడి 8 తులాల బంగారం, రూ.10వేల నగదును అపహరించుకుపోయారు. చోరీ విషయాన్ని పోలీసులకు తెలపడంతో సీఐ శ్రీను, ఎస్‌ఐ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రల నమూనా సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి'

దుబ్బాక, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎన్‌పీఆర్‌డీ దుబ్బాక మండలాధ్యక్షుడు సాజీద్ డిమాండ్ చేశారు. ఆదివారం దుబ్బాకలోని సీఐటీయూ కార్యాలయంలో వికలాంగులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులతో కోసం ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వారి ఖాతాల్లో జమచేయాలన్నారు. అంతేకాకుండా అంత్యోదయ కార్డులను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వికలాంగులు లక్ష్మీనర్సయ్య, యాదగిరి, ప్రభాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి



నాయిని యాదగిరి

గజ్వేల్, ఫిబ్రవరి 11: గజ్వేల్ పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ నాయిని యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన సిటిజన్స్ క్లబ్ ఎన్నికల్లో ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో నామినేషన్ వేసిన అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు అమర నాగేందర్, ఆర్యం శ్రీనివాస్, పోగుల రమేశ్ పేర్కొన్నారు. అధ్యక్షుడిగా నాయిని యాదగిరి, ఉపాధ్యక్షుడిగా నల్లా సీతారామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎ.సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దుంబాల భూపాల్‌రెడ్డి, కోశాధికారిగా సుదగాని మల్లయ్యగౌడ్, క్రీడల కార్యదర్శిగా గుంగాల నరేశ్ ఎన్నికైనట్లు తెలిపారు.

గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన సీఐ సైదా



ప్రభుత్వాసుపత్రిలో పోలీసుల నంబర్లను అతికిస్తున్న సీఐ సైదా

గజ్వేల్, ఫిబ్రవరి 11: గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని సీఐ బి.సైదా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, స్టాఫ్‌నర్సులతో కలిసి భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు తెలియపరచాలని నోటీసు బోర్డులో పోలీసు అధికారుల, సిబ్బంది నెంబర్లను అతికించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలు సైతం సమన్వయం పాటించాలని సూచించారు.

సమాచారం

రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

హత్నూర, ఫిబ్రవరి 11: హత్నూర మండల పరిధిలోని బడంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ క్రియాశీలక కార్యకర్త లాలి నారాయణగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం ఆయన భార్య జ్యోతికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంజనేయులు, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీవాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్‌రెడ్డి నియామకం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన బాధ్యతను జవాబుదారి తనంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాగా జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు కల్పిస్తూ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎ.వెంకట నర్సింహ్మారెడ్డి, ఆర్.ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శులుగా బి.కుమార్, ఎం.నాగరాజు, కె.రజిని, జిల్లాలోని పట్టణ, మండల అధ్యక్షులను ప్రకటించారు.

నాగల్‌గిద్ద మండలాధ్యక్షుడిగా రాజశేఖర్

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 11: బీజేపీ నాగల్‌గిద్ద మండలాధ్యక్షుడిగా రాజశేఖర్ పాటిల్ ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించినందుకు జిల్లా అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

జిన్నారం మండలాధ్యక్షుడిగా జగన్‌రెడ్డి

జిన్నారం: బీజేపీ జిన్నారం మండలాధ్యక్షుడిగా సోలక్‌పల్లికి చెందిన జగన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జగన్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా జగన్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా మహిళా శక్తి సమ్మేళనం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11: మెదక్ విభాగ్ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. మహిళలతోనే భారతీయ సంస్కృతి, కుటుంబ విలువల పరిరక్షణ సాధ్యమని మెదక్ సరస్వతీ కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కర్ని సుమిత్రాప్రభాకర్ పేర్కొన్నారు. మహిళా సాధికారత విద్యతోనే సాధ్యమన్నారు. విద్య అంటే కేవలం మార్కులు కాదని, జ్ఞాన సముపార్జన అని ఆమె అన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే మహిళా శక్తి సమ్మేనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

తూప్రాన్, ఫిబ్రవరి 11: తూప్రాన్ పట్టణ శివారులోని హల్దీ వాగులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఆదివారం గుర్తించినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. తూప్రాన్ వాగులో కుళ్లిన స్థితిలో సుమారు 70 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు వెల్లడించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోగా, వృద్ధుడిపై ఉన్న షర్ట్, దుప్పటి ఆధారంగా మతిస్థిమితంగా లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహం నాలుగైదు రోజులు హల్దీవాగులో ఉండడంతో కుళ్లిపోయినట్లు ఎస్‌ఐ శివానం వివరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

తొగుట/మిరుదొడ్డి, ఫిబ్రవరి 11: బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని గుడికందుల గ్రామంలో మాజీ సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్య సతీమణి రాజవ్వ ఇటీవల మరణించగా, ఆదివారం వారి కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. రాజవ్వ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే గ్రామానికి చెందిన బంగారుగళ్ల రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. అంతకుముందు కాన్గల్‌లో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి జప్తిలింగారెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని మల్లన్న ఆలయం వద్ద జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు భోంపల్లి మనోహరరావు, రొట్టె రాజమౌళి పంతులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మాజీ మండలాధ్యక్షుడు చిలివేరి మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దుబ్బాక మండలం పోతారంలోని ఆయన స్వగృహంలో అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెకు చెందిన కొండ వెంకటేశం అనే బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల ఇన్సూరెన్స్ బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఉన్నారు.



గుడికందులలో మాజీ సర్పంచ్ మల్లయ్య కుటుంబాన్నిపరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



రోడ్డుపైన ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుపైనే మురుగునీరు ప్రవాహం

చేర్యాల, ఫిబ్రవరి 11: కొమురవెల్లి శివారు నూతన పోలీస్‌స్టేషన్ భవన సమీపంలోని ఓ ప్రైవేటు భవనం నుంచి మురుగునీరు రోడ్డు పైనుంచే ప్రవహిస్తున్నది. దీంతో మల్లన్న జాతర సందర్భంగా సమీప ప్రదేశంలో వాహనాలను నిలిపివేస్తుండటంతో భక్తులు కాలినడకనక నడుచుకుంటూ వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం తగదని మండిపడుతున్నారు. మల్లన్న జాతర సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చిన నేపథ్యంలో చేర్యాల-కొమురవెల్లి రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. కొద్దిరోజులుగా గ్రామ శివారులోనే పోలీసులు వాహనాలు నిలిపివేయగా, ఆదివారం ఆర్టీసీ బస్టాండు వరకు అనుమతించారు. దీంతో సరైన పార్కింగ్ ప్రదేశం లేక ఒకేదారి గుండా రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులుపడ్డారు.

మద్దూరులో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

మద్దూరు, ఫిబ్రవరి 11: మద్దూరు మండల కేంద్రంలో ఆదివారం బొడ్రాయి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని మలయాలయ విష్ణునందాస్వామి, విఘ్నేశ్వరశర్మ, పానుగంటి తిరుపతయ్యతో పాటు పంబాల పూజారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలు సమర్పించారు. అంతకుముందు గణపతిపూజ, పూర్ణాహుతి, బలినివేదన, అంకురార్పణ, పోతరాజులకు పట్నాల కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఈ బొడ్రాయి ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, షౌకత్ అలీ, మ్యాక మల్లేశం, వసీయొద్దీన్, కామిడి రమేష్‌రెడ్డి, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, ముంతాజ్‌హుస్సేన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపన చేస్తున్న పూజారులు

'గృహజ్యోతి' సర్వేకు సహకరించాలి

● విద్యుత్‌శాఖ జిల్లా అధికారి మహేష్‌కుమార్

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 11: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గృహజ్యోతి పథకం సర్వేకు జిల్లా ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ జిల్లా అధికారి మహేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం కోసం విద్యుత్‌శాఖ సర్వే చేస్తున్నదన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌ను మీ వద్దకు వచ్చే విద్యుత్ సిబ్బందికి ఇవ్వాలన్నారు. లేదా మీకు దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయంలో సంబంధిత జిరాక్సు పత్రాలను అప్పగించాలని కోరారు. 14లోగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 52శాతం మంది వినియోగదారులు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 11: చేర్యాల పట్టణంలోని ప్రతీ దుకాణాదారుడు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలను ఆదివారం పరిశీలించి సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత వివరించారు. ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని తెలిపారు. ఆయనవెంట చేర్యాల ఎస్‌ఐ దామోదర్ ఉన్నారు. అనంతరం చేర్యాల మండలం తాడూరు గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు.

భూనిర్వాసితులందరికీ ప్యాకేజీ, ప్లాట్లు అందించాలి

● ఏటిగడ్డ కిష్టాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 11: మల్లన్నసాగర్ భూనిర్వాసితులందరికీ ప్యాకేజీ, ప్లాట్లు అందించాలని కాంగ్రెస్ ఏటిగడ్డ కిష్టాపూర్ సీనియర్ నాయకుడు ఎల్లండి నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గజ్వేల్ పట్టణంలోని ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన నాయకులు ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు రానివారు ఈ విషయాన్ని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామస్థులు వజ్రోజు రవిందర్, బండ్ల కొండయ్య, అకుల సంపత్‌కుమార్, వంజరి శ్రీనివాస్, బంజారా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సాంద్రానందాశ్రమంలో పాదపూజ మహోత్సవం



సాంద్రానందాశ్రమ యాగశాలలో హోమం నిర్వహిస్తున్నరుత్విక్కులు

చేర్యాల, ఫిబ్రవరి 11: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని ఆధ్యాత్మిక క్షేత్రం సాంద్రానందాశ్రమంలో ఆదివారం పాదపూజ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, దీక్షాధారణ, బ్రహ్మకూర్చ హవనం, కూష్మాండగన హోమం జరిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

న్యాయవాదికి జాతీయ సేవారత్న అవార్డు



బహుజన సాహిత్య అకాడమి అవార్డును అందుకుంటున్న కౌన్సిలర్ పద్మ

చిన్నకోడూరు/హుస్నాబాద్, ఫిబ్రవరి 11: చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన న్యాయవాది వర్కోలు రాజలింగం జాతీయ సేవారత్న అవార్డు (2024) అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ ఏడవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రమనియన్ రాజలింగంకు అవార్డును అందజేశారు. అలాగే హుస్నాబాద్ మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ చిత్తారి పద్మ ఆదివారం తిరుపతిలో జాతీయ బహుజన సాహిత్య అకాడమి అవార్డును ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ చేతులమీదుగా అందుకున్నారు.



జాతీయ సేవారత్న అవార్డును అందుకుంటున్న రాజలింగం

'గృహలక్ష్మి' దరఖాస్తులపై అధికారుల స్పెషల్ డ్రైవ్



వెల్దుర్తిలో వినియోగదారుల నుంచి వివరాలను సేకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11: ఖేడ్ మండలం పైడిపల్లిలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబరు, ప్రజాపాలనలో అందజేసిన దరఖాస్తు నంబరును విద్యుత్ సిబ్బందికి తెలపాలన్నారు.

●వెల్దుర్తి, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులందరికీ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ తూప్రాన్ డీఈ రాజేందర్ తెలిపారు. ఆదివారం విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏడీఏ రాజమల్లేశంతో కలిసి గృహజ్యోతి దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రజల నుంచి వివరాలను సేకరించారు. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందడానికి వినియోగదారులు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు విద్యుత్ సర్వీస్ నంబర్‌ను విద్యుత్ శాఖ అధికారులకు ఈ నెల 15వరకు ఇవ్వాలని సూచించారు.

● తూప్రాన్: తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఏడీఈ రాజమల్లేశం, ఏఈ వరహాల బాబు, సబ్ ఇంజనీర్లు నరేందర్, సాదుల్లా పాల్గొన్నారు.

● మాసాయిపేట: మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకందారులను గుర్తించి అర్హులైన వారికి ప్రజాపాలన ఫలాలు అందించేలా చేయడమే లక్ష్యంగా శిబిరం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ వెల్లడించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వినియోగదారులు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చు అని తెలిపారు.

చిన్నకోడూరు ఎస్‌ఐగా బాలకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలకృష్ణ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 11: చిన్నకోడూరు నూతన ఎస్‌ఐగా బాలకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన సుభాష్‌గౌడ్ సీసీఎస్-1 (సిద్దిపేట)కు బదిలీ కాగా, సీఎస్‌బీ (సిద్దిపేట) ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 11: చిన్నకోడూరు మండలం గోనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

జక్కాపూర్ విద్యార్థినికి మాచిరాజు బాలసాహిత్య పురస్కారం

నారాయణరావుపేట/కొండపాక, ఫిబ్రవరి 11: మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దుబ్బాక భువనేశ్వరికి మాచిరాజు బాల సాహిత్య పురస్కారం లభించింది. ఈ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దాసరి వెంకటరమణ చేతుల మీదుగా అందుకున్నది. ఈ కార్యక్రమంలో మాచిరాజు కామేశ్వరరావు, చొక్కాపు వెంకట రమణ, భైతి దుర్గయ్య పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరిని ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు. అలాగే కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పుల్ల ఐశ్వర్య ఆదివారం రవీంద్రభారతిలో బాలసాహిత్య అవార్డును అందుకున్నది. ఐశ్వర్య రాసిన 'తేనెటీగ సాయం' అనే కథకు పురస్కారం లభించిందని ప్రధానోపాధ్యాయులు పెద్ద విఠల్ తెలిపారు.



నారాయణరావుపేట: బాలసాహిత్య పురస్కారం అందుకుంటున్న భువనేశ్వరి



కొండపాక: విద్యార్థిని ఐశ్వర్యకు పురస్కారం అందజేస్తున్న బాలసాహిత్య పీఠం ప్రతినిధులు

భారీ వాహనాలతో పాడవుతున్న రోడ్డు



భారీ వాహనాలతో మర్పడగ శివారులో పాడైన రోడ్డు

కొండపాక, ఫిబ్రవరి 11: కొండపాక మండలం మర్పడగ సిరిసినగండ్ల గ్రామాల కూడలి వద్ద రోడ్డు తరచూ భారీ వాహనాలతో పాడవుతున్నది. దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద రుసుం తప్పించుకోవడం కోసం పెద్ద పెద్ద వాహనాలన్నీ సిద్దిపేట నుంచి మర్పడగ మీదుగా వెళ్తున్నాయి. దీంతో రోడ్డుపై పెద్ద గుంతలు పడుతున్నాయి. అధికారులు స్పందించి భారీ వాహనాలను నిలిపేస్తే సమస్య పరిష్కారమవుతున్నదని పేర్కొంటున్నారు.